క్లుప్తంగా

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

జాళ్లపాలెం (కొండపి): మండలంలోని పెదకండ్లగుంట పంచాయతీ జాళ్లపాలెంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యంవీ రమణమూర్తి శనివారం తెలిపారు. అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని చెప్పారు.

గడప గడపకు మన ప్రభుత్వం రేపు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ నర్రావానిపాలెంలో ఈనెల 12వ తేదీ ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు వరికూటి మాలకొండయ్య, కోటమ్మ జ్ఞాపకార్థం పెదకాకాని శంకరకంటి వైద్యశాల, వరికూటి చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ వరికూటి అమృతపాణి శనివారం తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరుకార్డు, ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు జిరాక్స్ కాపీలు, ఫోన్ నంబరు తీసుకొని రావాలని తెలిపారు.

నేడు మత్స్యకారులకు ఉచిత వైద్య శిబిరం

ఉలవపాడు: మండల పరిధిలోని పెదపట్టపుపాలెంలో మత్స్యకారులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మెరైన్ సీఐ కిషోర్‌బాబు తెలిపారు. పెదపట్టపుపాలెంలోని రామాలయం వద్ద ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు శిబిరంలో రోగులను పరీక్షిస్తారన్నారు. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ సీఐ డి.వెంకటేశ్వర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని వీఆర్‌కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సెబ్ సీఐ డి.వెంకటేశ్వర్లు దాడిచేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. సెబ్ సీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కర్ర లారీ బోల్తా



పొలాల్లో తిరగబడిన సరుగుడు కర్ర లారీ

గుడ్లూరు: సరుగుడు కర్రతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కొత్తపేటలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే. గ్రామ పొలాల్లో సరుగుడు కర్రలను లోడు చేసుకుని గుడ్లూరుకు లారీ వస్తుండగా కొత్తపేట మలుపు వద్ద లారీ అదుపు తప్పి పొలాల్లోకి తిరగబడింది. పక్కనే ఉన్న గ్రామస్తులు లారీ డ్రైవర్‌ను అందులో నుంచి బయటకు తీశారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. లారీలో కూలీలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

30 హెక్టార్లలో జామాయిల్ తోట దగ్ధం

గుడ్లూరు: మంటలంటుకొని అటవీ శాఖ భూముల్లోని జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గుడ్లూరు.తెట్టు ప్రధానరహదారిలో శనివారం జరిగింది. గుడ్లూరు దాటిన తరువాత రహదారి పక్కన ఉన్న చెత్తకుప్పలకు నిప్పు అంటించడంతో గాలుల దాటికి మంటలు వ్యాపించి పక్కనే అటవీ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ చెట్లకు అంటుకున్నాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో 30 హెక్టార్లలో చెట్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కందుకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.



తగలబడుతున్న జామాయిల్ చెట్లు



ఉలవపాడు ఎంపీపీఎస్ దక్షిణం(నాడు)



ఉలవపాడు ఎంపీపీయస్ దక్షిణం పాఠశాల(నేడు)

సర్కారీ బడులకు సరికొత్త శోభ..!

- నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
- రూ.కోట్ల వెచ్చించి అభివృద్ధి పనులు
- వసతుల్లో మేటిగా ప్రభుత్వ పాఠశాలలు

ఉలవపాడు: పాఠశాలలంటే విద్యాలయాలు. ఇక్కడే సంస్కృతి, సంస్కారం పురుడు పోసుకుంటుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న పాఠశాలలు ఇప్పటి వరకు సౌకర్యాల లేమితో కునారిల్లాయి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. నాడు–నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పించారు. దీంతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయి.

పూర్తిస్థాయిలో మౌలిక వసతులు

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు అంటే పాత భవనాలు...మరుగుదొడ్ల కోసం విద్యార్థుల ఇబ్బందులు.. సక్రమంగా అందని పుస్తకాలు... ఇదీ పరిస్థితి. కానీ కాలం మారింది. 201 లో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిపోయాయి. మండలంలో తొలి విడతగా 20 పాఠశాలలు ఎంపిక చేసి వాటిలో మౌలిక వసతుల కోసం రూ.5.43 కోట్లు కేటాయించారు. పనుల్లో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు కలిసి పనులు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. రెండేళ్లలో ఈ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. తిరిగి రెండో విడతలో 36 పాఠశాలలను ఎంపిక చేసి రూ.14.46 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ పాఠశాలల పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. ఇలా నాలుగేళ్లలో పాఠశాలల స్వరూపాలే పూర్తిగా మారిపోయాయి. మండల పరిధిలో మొత్తం 65 పాఠశాలలు ఉన్నాయి అందులో ఎలిమెంటరీ 50, ప్రాథమికోన్నత 4, హైస్కూళ్లు 11 ఉండగా అందులో తొలి, రెండవ దశ కలిపి 55 పాఠశాలల రూపురేఖలు మరగా మిగిలిన 10 పాఠశాలలు కూడా మూడవ విడతలో బాగుపడనున్నాయి.



నాడు నేడు తర్వాత సర్వాంగ సుందరంగా తయారయిన వీరేపల్లి మోడల్ స్కూల్



ఉలవపాడు జీవీవీకె స్కూల్ లో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన బల్లలు

మండలంలో మొత్తం పాఠశాలలు: **65**

నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాలలు **55**

ఖర్చు చేసిన మొత్తం రూ.**19:89** కోట్లు

సౌకర్యాలు మెరుగుపడ్డాయి



ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రూమ్‌లలో ఫ్యాన్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఉన్నాయి. బాలికలకు వసతులు ఇప్పుడు బాగున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకుంటున్నాం.

– వి. స్పందన, 9 వ తరగతి భీమవరం

సంతోషంగా ఉంది



ప్రస్తుతం పాఠశాలల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, వాటిని పరిశుభ్రం చేయడానికి మహిళలను ఏర్పాటు చేయడంతో బాలికలు చాలా ఆనంద పడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలుచాలా బాగున్నాయి.

– మార్లెళ్ల శరణ్య, భీమవరం

విద్యార్థుల్లో కళ్లలో ఆనందం

పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు చూసి విద్యార్థులు ఆశ్చర్యపోతున్నారు. ప్రధానంగా బాలికలకుసంబంధించి ఇబ్బందికరంగా ఉండే మరుగుదొడ్ల సమస్య తీరింది. ఇక విద్యాకానుక పేరుతో కార్పొరేటు కన్నా మిన్నగా బూట్లు, యూనిఫామ్, బ్యాగ్ లతో పాఠశాలలకు వెళుతున్నారు. మంచి బల్లలు, ఫ్యాన్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసిస్తున్నారు. ఒక్కసారిగా పాఠశాలల్లో ఇన్ని సదుపాయాలు వచ్చే సరికి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మారిన రూపురేఖలు...

నాడు–నేడు పథకం ద్వారా బడుల స్వరూపాలే మారిపోయాయి. ప్రధానంగా బిల్డింగులు, నూతన మరుగుదొడ్లు, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించడం, భోజనం తరువాత వాష్‌బేసిన్‌లు ఏర్పాటుచేయడం, క్లాసులు చెప్పడానికి కొత్త బ్లాక్‌బోర్డులు, అనువుగా ఉండే బల్లలు, రంగులు అద్ది అలంకరించడం, డిజిటల్ క్లాసులు ,టీవీ ద్వారా విద్యను అందిచడం లాంటి సౌకర్యాలు కల్పించడంతో ప్రభుత్వ విద్యపై ప్రభుత్వంలో నమ్మకం పెరిగింది.

ప్రజా వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాదాసి వెంకయ్య

టంగుటూరు: ప్రజలు స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రజా వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకొవాలని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య అన్నారు. స్థానిక పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో బొడ్డు నరసింహం, ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం చేపట్టిన వైద్య శిబిరాన్ని శనివారం వెంకయ్య ప్రారంభించారు. సంస్థ గౌరవ సలహాదారులు, ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, అనపర్తి శ్రీనివాసరావు, వి. చెంచయ్య పాల్గొన్నారు.

ఘనంగా నాగార్పమ్మవారి కొలుపులు



కొలుపుల్లో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో కొండవర్దువారి ఇలవేల్పు నాగార్పమ్మ కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అమరావతి సముద్రస్నానాకి తీసుకెళ్లారు. గురు, శుక్ర, శనివారాల్లో మాతుడుపు, పుట్ట బంగారం, బొల్లావులు, వీరతాళ్లతో గ్రామోత్సతం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న నాగార్పమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, జిల్లాలోని కొండవర్దు కుటుంబ సభ్యులంతా కొలుపులకు రావడంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారంతో కొలుపులు ముగించి రాత్రికి అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు



ఉలవపాడులో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉలవపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు జరిపారు. పోటీలలో విజేతలకు ఆదివారం బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. ముందుగా విద్యార్థులతో నీతి కథలు చదివించారు. మహనీయుల చరిత్రలు చదివించారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కనిగిరి రూరల్: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులకు కథల, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మ్యూజికల్ చైర్స్, ఖోఖో పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గ్రంథపాలకుడు ఎస్‌కే అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ మ్యూజికల్ చైర్స్ విభాగంలో విద్యార్థులు హర్షచరన్, రింషా, నౌరిన్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. ఖోఖో విభాగంలోని విన్నర్స్, రన్నర్ టీంలకు ఆదివారం ముగింపు రోజు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రిసోర్స్‌పర్సన్ ఫణీంద్ర కుమార్, గూగుల్ కంప్యూటర్స్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.13,21,515

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.13,21,515 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.24,800, తలనీలాలు రూ.90,800, ప్రత్యేక దర్శనం రూ.4,82,400, లడ్డుప్రసాదాలు రూ.2,20,605, అన్నదానం రూ.3,75,470, రూమ్‌అద్దెలు రూ.36,090 వచ్చినట్లు పేర్కొన్నారు.

నాగార్పమ్మకు ప్రత్యేక పూజలు



నాగార్పమ్మ గుడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: మండలంలోని లింగారెడ్డిపల్లిలో నాగార్పమ్మ తిరునాళ్ల మహోత్సవంలో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నాగర్పమ్మకు విశిష్ట పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బుర్రా బొల్లావులను ఎత్తుకున్నారు. నాగార్పమ్మ కొలుపుల తిరునాళ్ల ఉత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు సంగుసుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ మండాది కృష్ణారెడ్డి, రామనబోయిన శ్రీనివాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బొల్లావులను ఎత్తుకున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

విద్యుత్ సమస్య పరిష్కారంపై దృష్టి



విద్యుత్ పోల్స్ పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

కనిగిరి రూరల్: పట్టణంలోని విద్యుత్ సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు, విద్యుత్ అధికారులు కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలోని లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అర్బన్ కాలనీలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కృషితో నియోజకవర్గంలో మరో రెండు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని, వాటిలో ఒకటి కనిగిరి మున్సిపాలిటీకి కేటాయించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో నూతన సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫారంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లో ఓల్టేజీ సమస్యపై కౌన్సిలర్ వినతి

పట్టణంలోని 13వ వార్డులో విద్యుత్ సమస్యపై కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్, స్థానికులు మున్సిపల్ చైర్మన్ గఫార్, ఏఈ పవన్‌కుమార్, ఎల్ఐ వెంకటయ్యకు విన్నవించారు. పాతకమూరి వారి వీధి, మున్సిపల్ ఆఫీసు వెనుక వీధి, మదీన మసీద్ వీధుల్లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ప్రతి రోజు కనీసం నాల్గు ఐదు సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మున్సిపల్ ఆఫీసు వెనుక కొండ వీధి, మంగళిమాన్యం, పీతుల దొరువు ప్రాంతాల్లో విద్యుత్ పోల్స్ ప్రమాద భరితంగా ఉన్నాయని, కొన్ని చోట్ల విద్యుత్ పోల్స్ మార్చాలని, మరి కొన్ని చోట్ల నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ రిజ్వాన ఖాలక్ అధికారులను విన్నవించారు. లో ఓల్టేజీ సమస్యపై ఇప్పటికే ఎస్ఈ, మున్సిపల్ కమిషనర్‌కు కూడా విన్నవించామన్నారు. దీంతో త్వరలో మున్సిపల్ ఆఫీసు వెనుక నూతన ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేసేందుకు ప్రతి పాదనలు పంపుతామని ఏఈ పవన్ తెలిపారు. కొత్త పోల్స్ ఏర్పాటు, పోల్స్ మార్పుకు ప్రతిపాదనలు పంపామని, మంజూరు కాగానే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేవరాజ్, శివ మాధవి, చొప్పరపు తిరుపతయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మన్సూర్, కొండారెడ్డిపల్లి రసూలా, చాంద్ బాషా, చాందు, రసూల్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

చాంద్‌బాషాను పరామర్శించిన ఎమ్మెల్యే బుర్రా



చాంద్‌బాషాను సన్మానిస్తున్న బుర్రా, నాయకులు

పామూరు: ముస్లిం మైనార్టీ సెల్ నాయకుడు షేక్ సెంట్రింగ్ చాంద్‌బాషాను కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్ శనివారం పరామర్శించారు. చాంద్‌బాషా కొంత కాలంగా అనారోగ్యంతో ఉందనే సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే..పామూరులోని చాంద్ బాషా స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో బుర్రా వెంట పార్టీ ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, యూత్ మండలాధ్యక్షుడు యాదాల సాయి కిరణ్, కోఆప్షన్ షేక్ నాయబ్‌రసూల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, ఖాదర్ బాషా, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్‌కు పరామర్శ



లియాఖత్‌ను పరామర్శించిన వరికూటి

సింగరాయకొండ: మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ లియాఖత్‌ను శనివారం రాత్రి స్థానిక శాంతి థియేటర్ సమీపంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పరామర్శించారు. ఇటీవల లియాఖత్ మోకాలు శస్త్ర చికిత్స చేశారు. ఈ విషయం తెలిసిన వరికూటి లియాఖత్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరికూటి మాట్లాడుతూ పార్టీకి లియాఖత్, ఆయన తండ్రి ఇస్మాయిల్ చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. తన సొంత స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మించి ఇచ్చారన్నారు. షేక్ ఇస్మాయిల్, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీం బాషా, ఎస్. సురేంద్ర, కాళహస్తి వెంకారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ ఫలాలు



పొన్నలూరులో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి ముఖ్య మంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. పొన్నలూరులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని ప్రతి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో నెరవేర్చి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అబద్ధపు హామీలను ఇచ్చి ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సొసైటీ చైర్మన్ గొల్లపూడి రవణయ్య, కంచర్ల రవణయ్య, గడ్డం ప్రసాద్, మండవ మాధవ, బోడా మల్లికార్జున, పల్లపోతు బాలయ్య, వెంకటేశ్వర్లు, గడ్డం వేణు, ముప్పరాజు చెంచయ్య, గడిపూడి వెంకటేశ్వర్లు, మెండా శ్రీరాములు, లేళ్లపల్లి లింగయ్య, చుండి ఏసుబాబు, జడ భరత్‌కుమార్, గౌడపేరు విజయ్ కుమార్ పాల్గొన్నారు.